సాక్షి
కామారెడ్డి
సోమవారం । 1 । జనవరి । 2024



వైభవంగా శోభాయాత్ర
జిల్లాలో అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రలలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.
- 9లో ▸



ఆటలు నిల్
ఐదారేళ్లుగా మండల స్థాయిలో క్రీడాపోటీలు నిర్వహించడం లేదు. దీంతో గ్రామీణ స్థాయి క్రీడాకారులు నష్టపోతున్నారు.
- 9లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
31.3 /12.6
ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

జిల్లాలో పోలీస్ యాక్ట్

కామారెడ్డి క్రైం: జిల్లాలో ఈ నెల 01 నుంచి 31 వరకు పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని ఎస్పీ సింధుశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు శాఖ అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, ధర్నాలు, ర్యాలీలు నిర్వహించకూడదని అన్నారు. ఏవైనా కార్యక్రమాలు చేయాలనుకుంటే సంబంధిత డివిజన్ పోలీసు అధికారులను సంప్రదించి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కొనసాగుతున్న నీటి విడుదల



నిజాంసాగర్: యాసంగి సాగు కోసం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటి విడుదల కొనసాగుతోంది. కాలువకు 1700 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1405 అడుగుల(17.8 టీఎంసీలకు) 1402.04 అడుగులు(13.735 టీఎంసీల) నీరు నిల్వ ఉంది.

వరల్డ్ రికార్డు నృత్యంలో కామారెడ్డి కళాకారులు



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి కూచిపూడి కళాక్షేత్రం విద్యార్థులు గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో పాల్గొని ప్రశంసాపత్రాలు పొందినట్లు కళాక్షేత్రం నాట్యగురువు కనకతార తెలిపారు. జాతీయ కళాకారుడు వంశీప్రతాప్‌గౌడ్ సహకారంతో గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు నృత్యబృందంలో పాల్గొనే అవకాశం దక్కిందని ఆయన పేర్కొన్నారు.

అగ్రిమెంట్ చెరుకునే గానుగకు తరలిస్తున్నాం

సదాశివనగర్: అగ్రిమెంట్ చేసుకున్న చెరుకునే గానుగకు తరలిస్తున్నామని, నాన్ అగ్రిమెంట్ చెరు కును తీసుకోవడం లే దని ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 13 మండలాల పరిధిలోని గ్రామాల్లో సాగు చేసిన చెరుకును ఫ్యాక్టరీకి తరలిస్తున్నట్లు తెలిపారు. కొంత మంది రైతులు ట్రాక్టర్లపై ఓవర్‌లోడ్‌తో చెరుకును తీసుకు వస్తున్నారని దీంతో కొన్ని ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. సామర్థ్యం మేరకే చెరుకును తీసుకురావాలని సూచించారు. ఫ్యాక్టరీలో క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుందన్నా రు. ఇప్పటి వరకు లక్షా 39 వేల 204 టన్నుల క్రషింగ్ జరిగినట్లు పేర్కొన్నారు. 3.50 లక్షల టన్నుల క్రషింగ్ లక్ష్యాన్ని పూర్తి చేస్తామని పేర్కొన్నారు. క్రషింగ్ పూర్తయ్యే వరకు రైతులు సహకరించాలని కోరారు.

నెలకో పుస్తకం చదవాలనుకుంటున్న..



జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడం, అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తూ త్వరతిగతిన పూర్తి చేసేలా చూడడం నా బాధ్యత. ఇదే సమయంలో నెలకొక పుస్తకాన్ని చదవాలని కొత్త సంవత్సరం సందర్భంగా సంకల్పం పెట్టుకున్నాను. కచ్చితంగా చదువుతాను. చదవడం ద్వారా మరింత జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చు. మా నాన్న ఉద్యోగ విరమణ చేసి నా దగ్గరకు వచ్చి ఉంటున్నారు. నేనెంతో సంతోషంగా ఉన్నాను. నాన్న కళ్ల ముందు ఉంటే మరింత ఉత్సాహంతో పనిచేస్తా. అందరి సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తా.
– జితేష్ వి పాటిల్, కలెక్టర్, కామారెడ్డి

సివిల్స్ లక్ష్యం నెరవేర్చుకున్న..



2016లో కొత్త సంవత్సరం సందర్భంగా సివిల్స్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకుని చదివి ప్రిపేర్ అయ్యాను. అనుకున్నట్టే ఆ ఏడాది జరిగిన పరీక్షకు అటెండ్ అయి ఐఏఎస్ సాధించాను. 2017 బ్యాచ్ ద్వారా సివిల్స్ శిక్షణ పొంది వివిధ ప్రాంతాల్లో పని చేసి ఇక్కడకు వచ్చాను. మాకు కొత్త ఏడాది ఎన్నికలతోనే గడచిపోతుంది. ఎన్నికల ఏర్పాట్లు చేసుకుంటూనే, స్థానిక సంస్థల పాలనను సక్రమంగా జరిగేలా చూస్తా. జిల్లా ప్రజలకు కొత్త సంవత్సరంలో అంతా మంచే జరగాలి.
– మను చౌదరి, అదనపు కలెక్టర్, కామారెడ్డి

కోటి ఆశలతో..

- 2024కు ఘన స్వాగతం పలికిన ప్రజలు
- జిల్లావ్యాప్తంగా వేడుకలు
- అంబరాన్నంటిన నూతన సంవత్సర సంబరాలు



భిక్కనూరులో కేక్ కట్ చేస్తున్న ఓ కుటుంబం



కాలగమనంలో మరో ఏడాది కరిగిపోయింది. 2023 సంవత్సరం ప్రజలకు అనేక జ్ఞాపకాలను మిగిల్చింది. ఎన్నెన్నో స్మృతులను మదిలో దాచుకొన్న ప్రజలు.. కోటి ఆశలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. అంతా మంచే జరగాలని ఆకాంక్షిస్తూ నవ వసంతంలోకి అడుగు పెట్టారు. జిల్లాలో ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు ఆదివారం రాత్రే ఆనందోత్సాహాల మధ్య మొదలయ్యాయి. యువత, విద్యార్థులు కొత్త లక్ష్యాలతో నూతన వత్సరానికి స్వాగతం పలికారు. అధికారులు కూడా కొత్త సంవత్సరంలో మరింత మెరుగైన సేవలు అందిస్తామని చెబుతున్నారు. – సాక్షి, కామారెడ్డి

లక్ష్యాన్ని సాధించేందుకు కృషి



ప్రస్తుతం మమత మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్నాను. ఎంబీబీఎస్ తర్వాత పీడియాట్రిషన్ చేసి, గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు సేవ చేయాలనుకుంటున్నా. కొత్త సంవత్సరంలో ఆ లక్ష్యం సాధించడానికి కష్టపడుతా. నూతన సంవత్సరం అందరి జీవితాల్లో సంతోషాలను నింపాలి.
– చెన్న సాహితి, వైద్య విద్యార్థి, ఎల్లారెడ్డి

మెడిసిన్‌లో పీజీ లక్ష్యం



ఎంబీబీఎస్ పూర్తి చేశాను. పీజీకి ప్రిపేర్ అవుతున్నాను. 2024లో పీజీ సీటు సాధించాలన్నదే నా లక్ష్యం. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న పిల్లలకు వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో పీజీ సీటు అదీ పిడియాట్రిషన్ సాధించేందుకు సంకల్పం తీసుకుంటున్నా. మా అమ్మ, నాన్న సువర్ణ, శ్రీనివాస్‌ల కలలను నిజం చేస్తాను. – డాక్టర్ భరత్ మ్యాదం, కొత్తపల్లి, మాచారెడ్డి మండలం

పేదలకు ఉచిత వైద్యం అందిస్తా



మా అమ్మ, నాన్న సబిత, సిద్దరాములు దశాబ్దాల కాలంగా సమాజం మేలు కోసం పనిచేస్తున్నారు. ప్రజా ఉద్యమాల్లో, కార్మిక ఉద్యమాల్లోనే వాళ్ల జీవితం కొనసాగింది. నేను ఇటీవలే బీహెచ్ఎంఎస్ పూర్తి చేశాను. అమ్మ, నాన్న స్ఫూర్తితో పేదలకు ఉచితంగా వైద్యం అందించేందుకు ప్రయత్నిస్తాను.
– డాక్టర్ స్పందన, మల్కాపూర్, బీబీపేట మండలం

యువతకు అవకాశాలు కల్పించాలి



కొత్త సంవత్సరంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. ఈ ఏడాది ప్రతి ఒక్కరికి కలిసి రావాలి. యువత కష్టపడి పని చేసినప్పుడే దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయి. నేను నా ఉద్యోగంలో ఉన్నతస్థాయికి చేరడానికి ఈ సంవత్సరంలో కష్టపడుతా.
– అంజలి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, మద్నూర్

అవిశ్వాసం వైపు అడుగులు

- కామారెడ్డి బల్దియాలో కుర్చీలాట!
- వైస్ చైర్‌పర్సన్‌ను దింపేందుకు బీఆర్ఎస్ పావులు
- చైర్‌పర్సన్ సీటుపై కన్నేసిన కాంగ్రెస్
- ఆసక్తికరంగా మారుతున్న బల్దియా రాజకీయం

కామారెడ్డి బల్దియాలో కుర్చీలాట మొదలయ్యింది. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టే యోచనలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఉండగా.. బల్దియా పీఠాన్ని కైవసం చేసుకునే దిశగా అధికార పార్టీ పావులు కదుపుతోంది. దీంతో బల్దియా రాజకీయం రసవత్తరంగా మారుతోంది.



కామారెడ్డి టౌన్: కామారెడ్డి బల్దియాలో 2020లో నిర్వహించిన ఎన్నికలలో బీఆర్ఎస్ 23, కాంగ్రెస్ 12, బీజేపీ 8 స్థానాల్లో గెలుపొందగా.. ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. ఇండిపెండెంట్ కౌన్సిలర్లందరూ బీఆర్ఎస్‌లో చేరడంతో బల్దియా పీఠాన్ని ఆ పార్టీ కైవసం చేసుకుంది. చైర్‌పర్సన్‌గా నిట్టు జాహ్నవి, వైస్‌చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ ఎన్నికయ్యారు. ఆ తర్వాత కాంగ్రెస్ నుంచి 8 మంది, బీజేపీ నుంచి ఇద్దరు కౌన్సిలర్లు బీఆర్ఎస్‌లో చేరడంతో బల్దియాలో ఆ పార్టీ బలం 39కి చేరింది.

పై ఎత్తులు వేస్తున్న అధికార పార్టీ..
అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరిన బల్దియా వైస్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ దంపతులు.. ప్రచారంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు అతడి తమ్ముడు కొండల్‌రెడ్డికి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి సన్నిహితుడిగా మారారు. కామారెడ్డిలో ఓడిపోయినా రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో కాంగ్రెస్‌లో జోష్ కనిపిస్తోంది. ఇదే క్రమంలో బల్దియా పీఠాన్ని కైవసం చేసుకునేందుకు పావులు కదుపుతోంది. ప్రస్తుత వైస్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియతో పాటు, పదో వార్డు కౌన్సిలర్ వనిత చైర్‌పర్సన్ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. మారిన రాజకీయ పరిస్థితుల్లో బల్దియాలో విలీనమైన గ్రామాలకు చెందిన ఐదుగురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌వైపు చూస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. కొందరు కౌన్సిలర్లపై హస్తం పార్టీ నేతలు వలవేసినట్లు తెలుస్తోంది. బీజేపీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు సైతం కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. దీంతో బల్దియా రాజకీయం ఆసక్తికరంగా మారింది.

కౌన్సిలర్లు సమావేశమై..
అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌లో వర్గపోరు నేపథ్యంలో సీనియర్ నాయకుడు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డిని ఆ పార్టీ సస్పెండ్ చేసింది. దీంతో ఆయన భార్య వైస్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం మరో ఐదుగురు కౌన్సిలర్లు కూడా బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఎన్నికలు ముగియడంతో వైస్‌చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు యోచిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం పొందుర్తి వద్ద గల ఓ ఫాంహౌజ్‌లో 30 మంది కౌన్సిలర్లు సమావేశమై వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. 25, 27 వార్డుల కౌన్సిలర్లు వైస్ చైర్‌పర్సన్ స్థానాన్ని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజాపాలన కార్యక్రమం అనంతరం అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశాలున్నాయి.

అయోధ్యరాముడి సేవలో కొత్తపల్లివాసి

- ఆలయ శంకుస్థాపనకు వెండి ఇటుకలను తయారీ చేసిన శ్రీనివాస శాస్త్రి
- బంగారు పాదుకలను తయారు చేసిందీయనే..
- పాదుకలతో రామేశ్వరం నుంచి పాదయాత్ర
- ఈనెల 12న అయోధ్యకు చేరుకోనున్న కార్యక్రమం

అయోధ్యాపురిలో ధర్మ స్వరూపుడైన శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనకు గడువు సమీపిస్తోంది. కౌసల్యా తనయు డి జన్మస్థలి నుంచి వచ్చిన అక్షింతలతో వాడవాడలా నిర్వహిస్తున్న శోభాయాత్రలతో భక్తుల్లో ఉత్సాహం ఉరకలెత్తుతోంది. లోకాభిరాముడి ఆలయ నిర్మాణ మహాయజ్ఞంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా కోట్లాది మంది పాలుపంచుకోగా.. క్రియాశీలక పాత్ర పోషించే అవకాశం మాక్లూర్‌లోని కొత్తపల్లికి చెందిన శ్రీనివాసశాస్త్రికి లభించింది. శంకుస్థాపనలో వినియోగించిన వెండి ఇటుకలు తయారు చేసిందీయనే కావడం గమనార్హం.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : దేశవ్యాప్తంగా అయోధ్య శ్రీరాముడి అక్షింతలతో వాడవాడలా సందడి నెలకొ న్న నేపథ్యంలో.. తెలుగువారంతా గర్వించేవిధంగా భక్తుడు మాక్లూర్ మండలం కొత్తప ల్లికి చెందిన చల్లా శ్రీనివాస శాస్త్రి రామయ్య సే వకు అంకితమయ్యారు. 1 కిలో బంగారం, 8 కిలోల వెండితో శ్రీరాముడి పాదుకలను కూడా హైదరాబాద్‌లో ఆయనే తయారు చేశారు. (వెండి పాదుకలకు బంగారు తొడుగు ఉంచుతారు). ఇక వెండి పాదుకలను శిరస్సుపై పె ట్టుకుని శ్రీనివాస శాస్త్రి అయోధ్యలో 41 రోజుల పాటు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశా రు. తర్వాత ప్రతినెలా 15 రోజుల పాటు ఈ పాదుకలతో దేశవ్యాప్తంగా పర్యటించారు. ఈ క్రమంలో దేశంలోని అన్ని పుణ్యనదుల్లో పాదుకలకు స్నానం చేయించారు. శృంగేరి, కంచి, తిరుమల, పుష్పగిరి, ఉడిపి, పూరి, మైసూరు గణపతి సచ్చిదానంద, జీయరుస్వామి పీఠాల్లో పాదుకలకు ఆయా పీఠాధిపతులు పూజలు చేశారు. గత మూడు నెలలుగా శ్రీనివాసశాస్త్రి రామేశ్వరం నుంచి అయోధ్య వరకు త్రేతాయుగంలో 'శ్రీరాముడు నడయాడిన' దారిలో (రామేశ్వరం-కిష్కింద (కర్ణాటక లోని రుష్యమూక పర్వతం)భద్రాచలం, కందకుర్తి, బాసర, మహోర్‌గఢ్, ఉన్కేశ్వర్, చిత్రకూట్(మధ్యప్రదేశ్) మీదుగా పాదుకలతో పాదయాత్ర చేస్తున్నారు. ఈనెల 12న అయోధ్యకు చేరుకోనున్నారు.



అయోధ్య రాజకుటుంబీకులతో కలిసి అయోధ్య కలెక్టర్‌కు ఇటుక ఇస్తున్న శ్రీనివాస శాస్త్రి



పాదుకలతో శ్రీనివాసశాస్త్రి

నాలుగేళ్లుగా అయోధ్యలోనే..
జిల్లాలోని మాక్లూర్ మండలం కొత్తపల్లికి చెందిన చల్లా శ్రీనివాసశాస్త్రి హైదరాబాద్‌లో సినిమా రంగంలో సౌండ్ ఇంజినీర్‌గా గతంలో పనిచేశారు. ఈ క్రమంలో రాముడి సేవ చేయాలనే తలంపుతో నాలుగేళ్లుగా అయోధ్యలోని లవకుశనగర్‌లో సతీమణి గాయత్రితో కలిసి ఉంటున్నారు. శ్రీనివాసశాస్త్రి తండ్రి లక్ష్మీసుందరం ఆర్ఎస్ఎస్‌లో స్వయం సేవక్.. ఆయన అయోధ్య రామమందిర ఉద్యమ సమయంలో కరసేవకుడిగా పనిచేశారు. ప్రస్తుతం అయోధ్యలో 'అయోధ్య - భాగ్యనగర్ సీతారామ సేవా ఫౌండేషన్'కు డైరెక్టర్‌గా వ్యవహరిస్తూ రోజూ 10వేల లడ్డూలను పంచుతున్నారు. ఇక ఈనెల 10వ తేదీ నుంచి అయోధ్య శ్యామాసదన్‌లో ప్రతిరోజూ 15 వేల మందికి ఫౌండేషన్ ద్వారా అన్నదానం చేపట్టే కార్యక్రమా న్ని ప్రారంభించనున్నారు. శ్రీనివాసశాస్త్రి తయారు చేసిన 5 వెండి ఇటుకలనే ఆలయ శంకుస్థాపనకు మోదీ ఉపయోగించడం విశేషం. ఒక్కో ఇటుకను 2.5 కిలోల వెండితో తయారు చేశారు. 2019లో రామజన్మభూ మిపై సుప్రీంకోర్టు తీర్పు వచ్చాక అయోధ్య రాజకుటుంబీకుడు బిమలేంద్రసింగ్ మిశ్రా సమక్షంలో అయోధ్య కలెక్టర్‌కు మొదటి ఇటుకను అందజేశారు. 2020 అగస్టు 2వ తేదీన మిగిలిన 4 ఇటుకలను తయారు చేశారు. ఈ 5 ఇటుకలను ప్రధాని శంకుస్థాపనకు ఉపయోగించడం విశేషం. జీవితాంతం రాముడి సేవలోనే తరిస్తామని శ్రీనివాసశాస్త్రి, గాయత్రి దంపతులు చెబుతున్నారు.

న్యూ ఇయర్ సందడి

కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా కామారెడ్డి పట్టణంలో సందడి సాగింది. బేకరీలలో కేక్‌ల విక్రయాలు జోరుగా సాగాయి. వివిధ ఆకృత్తులలో కేక్‌లను తయారు చేశారు. కేక్‌లతో పాటు కూల్‌డ్రింక్‌లు, మాంసం, మద్యం విక్రయాలు భాగానే జరిగాయి. కేక్‌లు కట్ చేసి కొత్త ఏడాదికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. – కామారెడ్డి టౌన్



ప్రజలకు సేవ చేస్తాను



కొత్త సంవత్సరం సందర్భంగా ప్రజలకు సేవ చేయాలని సంకల్పం పెట్టుకున్నా. 2024 ఏప్రిల్ నుంచి నెలలో ఒక్క రోజు నా సొంత గ్రామమైన భిక్కనూరులో ప్రజలకు ఉచితంగా సేవలు అందజేస్తాను. మందులు, కంటి అద్దాలను అందజేస్తాను.

– డాక్టర్ సంకీర్తన, ఎంఎస్ ఆప్తాల్మాలజీ, భిక్కనూరు



కామారెడ్డిలోని ఓ బేకరిలో కేక్‌లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

దర్జాగా తోడేస్తున్నారు..?

- ఎస్సారెస్పీ వరద కాలువ జీరో పాయింట్ నుంచి మొరం తవ్వకాలు
- రాత్రి వేళలో జోరుగా సాగుతున్న దందా
- ప్రాజెక్టు, రెవెన్యూ అధికారుల మధ్య సమన్వయ లోపం
- అవకాశంగా మలుచుకుంటున్న అక్రమార్కులు



ముప్కాల్‌లో మొరం తరలిస్తున్న టిప్పర్

బాల్కొండ: అక్రమాల్లో ఆరితేరిన కొందరు.. దొరికినంత దోచుకునే పనిలో పడ్డారు. కబ్జాకు కాదేది అనర్హం అన్నట్లుగా కాలువ, కుంటలు, మట్టి గుట్టలను గుల్ల చేస్తున్నారు. యంత్రాలతో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇళ్ల నిర్మాణాలు, వెంచర్ల ఏర్పాటుకు మట్టి డిమాండ్ ఉండడంతో కాసులు కురిపిస్తున్న నేపథ్యంలో అక్రమార్కులు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన ప్రాజెక్టు, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో వారి వ్యాపారం మూడు టిప్పర్లు.. ఆరు ట్రాక్టర్లుగా దర్జాగా సాగుతోంది..

నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద వరద కాలువ జీరో పాయింట్ నుంచి అక్రమార్కులు మొరం దందాను నిశిరాత్రిలో జోరుగా సాగిస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండానే ఎస్సారెస్పీ నుంచి నీటి సరఫరా చేసే వరద కాలువ తవ్వకాల్లో చేపడుతున్నారు. మొరం తరలించాలంటే అధికారుల అనుమతితో ప్రభుత్వానికి డీడీ రూపంలో క్యూబిక్ మీటర్‌కు రూ. 136 చెల్లించాలి. అంతేకాకుండా అధికారుల పర్యవేక్షణలో తరలించాలి. కానీ అక్రమార్కులు ప్రభుత్వ అనుమతులు లేకుండానే అధికారులను మచ్చిక చేసుకొని తమ మొరం దందాను దర్జాగా కొనసాగిస్తున్నారు.

సెలవు దినాలు, రాత్రి వేళల్లో..

మొరం వ్యాపారులు రాత్రి వేళల్లో, సెలవు దినాల్లో ఎక్కువగా కొనసాగిస్తున్నారు. కొందరు అధికారులు తమకు అందాల్సింది అందితే వారికి ఎలా మొరం తరలించుకోవాలో అక్రమార్కులు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. ఏ అధికారికి ఎంత ఇస్తున్నామనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. ఇంతలా వారికి అండగా ఉండి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అధికారులు, అక్రమార్కులపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సమన్వయ లోపం..

ఎస్సారెస్పీ, వరద కాలువ నుంచి మొరం తరలించాలంటే ప్రాజెక్ట్ అధికారులు అనుమతివ్వాలి. కానీ రెవెన్యూ అధికారులు సైతం తమ అనుమతి కూడా ఉంటుందని చెబుతున్నారు. దీంతో రెండు శాఖల మధ్య సమన్వయ లోపంతో మొరం వ్యాపారులకు అవకాశంగా మారింది. ఇరు శాఖల అధికారులు సైతం ఎవరికీ వారు అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనేది బహిరంగ రహస్యం.

చర్యలు తీసుకుంటాం..

మొరం రాత్రి వేళల్లో తరలిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. చర్యలు తీసుకుంటాం. మొరం తరలించాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. ఎవరైనా మొరం తరలిస్తే ఉపేక్షించేది లేదు. ఎంతటివారినైనా వదలం. సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

–చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

రేపు కబడ్డీ పోటీలకు ఎంపిక

నిజామాబాద్ నాగారాం: నగరంలోని పాత కలెక్టరేట్‌లో అంతర్ జిల్లాల కబడ్డీ జూనియర్ బాల, బాలికల ఎంపికలను మంగళవారం నిర్వహించనున్నట్లు కబడ్డీ జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి లింగన్న ఆదివారం తెలిపారు. క్రీడాకారులు 2004 ఫిబ్రవరి 5 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను 11 నుంచి 14వ తేదీ వరకు సిద్దిపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు.

ఆఫీసర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

సుభాష్‌నగర్: నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు శశిధర్‌రెడ్డి, అరవింద్‌కుమార్ ఆదివారం తెలిపారు. అధ్యక్షుడిగా జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఉపాధ్యక్షులుగా సీపీ కల్మేశ్వర్ సింగేనవార్, అదనపు కలెక్టర్ యాదిరెడ్డితోపాటు టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాహెర్‌బీన్ హందాన్, కార్యదర్శిగా చిలువేరి సత్యం, జాయింట్ సెక్రటరీగా వెంకట్రాములు, కోశాధికారిగా రిటైర్డ్ ఎస్‌టీఓ గంగాకిషన్ ఎన్నికయ్యారు.

రాష్ట్ర కార్యవర్గంలో చోటు



డొంకేశ్వర్(ఆర్మూర్): హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన తెలంగాణ అగ్రికల్చర్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో జిల్లా ఉద్యోగికి చోటు లభించింది. నూతన రాష్ట్ర కార్యవర్గంలో బాల్కొండ మండల వ్యవసాయాధికారి ఎస్.మహేందర్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఇప్పటికే జిల్లా కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్న మహేందర్‌కు రాష్ట్ర కార్యవర్గంలో పదవి రావడంపై జిల్లాలోని వ్యవసాయ శాఖ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

ఇండియా బుక్ ఆఫ్ అవార్డ్స్‌లో చైత్ర



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అచీవర్ అవార్డుతో చిన్నారి బాస చైత్ర

నిజామాబాద్ నాగారం: మూడేళ్ల ఆ చిచ్చర పిడుగు స్కూలుకు వెళ్లకుండానే ఇంట్లోనే ఉంటూ విషయ పరిజ్ఞానంపై పట్టు సాధించి అరుదైన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అచీవర్ అవార్డును సాధించింది. నగరంలోని గాయత్రీనగర్‌కు చెందిన బాస చైత్ర 17 జాతీయపండుగలు, 12 జాతీయ గుర్తులు, 13 అంతరిక్ష వస్తువులు, 26 శరీర భాగాలు, 26 రకాల జంతువులు, 22 రకాల కూరగాయలు, 21 పండ్లు, 13 రంగులు, 8 రకాల ఆకారాలు (ట్రయాంగిల్, స్క్వేర్, సర్కిల్ లాంటివి) గుర్తుపట్టడంతో పాటు 26 అల్ఫాబెట్స్‌కి సంబంధించిన వస్తువుల పేర్లను, 11 ఇంగ్లిష్ రైమ్స్‌ని ధారాళంగా తడబడకుండా చెప్పేస్తుంది. ఈ పాప ప్రతిభను గుర్తించిన ఐబీఆర్ సంస్థ ఇటీవల నిర్వహించిన ఓ కార్యక్రమంలో చైత్ర ధారాళంగా చెప్పిన వాటిని ఆమె ప్రతిభా పాటవాలను ప్రత్యక్షంగా చూసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డు సంస్థ వారు అచీవర్ అవార్డును ప్రదానం చేశారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డు సంస్థ అనేది ఇండియాలోని ఆయా రాష్ట్రాల్లో ఉన్న అత్యుత్తమ వ్యక్తుల ప్రతిభని, ఒక సంస్థ సాధించిన ప్రగతిని భద్రపరచి భావి తరాలకు స్ఫూర్తిని అందించే సంస్థ. దీనిలో భాగంగా రాష్ట్రంలోని నగరానికి చెందిన గాయత్రీనగర్‌కు చెందిన బాస చైత్ర ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం సంపాదించడంపై పలువురు మేధావులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అచీవర్ అవార్డును అందుకోవడం అభినందనీయమంటూ పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. చైత్రకు ఐబీఆర్‌లో స్థానం దక్కడంతో ఆమె తల్లిదండ్రులైన బ్యాంక్ ఉద్యోగిని అన్నపూర్ణ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సుశీల్ కుమార్‌లు హర్షం వ్యక్తం చేశారు. తమ పాప ఇప్పటి వరకు స్కూల్‌కు కూడా వెళ్లలేదని, ఇంట్లోనే ఉంటూ విషయ పరిజ్ఞానంపై పట్టు సాధించి అచీవర్ అవార్డును కైవసం చేసుకుందన్నారు.

కొంగల వరుస



మండలంలోని రైతులు నాట్లకు మడులను సిద్ధం చేశారు. రెడ్డిపేటలో కేజ్‌వీల్‌తో దమ్ము చేసిన పొలాల్లోకి కొంగలు వస్తూ కనివిందు చేస్తున్నాయి.

– రామారెడ్డి

న్యూ ఇయర్‌పై పోలీసుల దృష్టి



కోర్టు చౌరస్తా వద్ద తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో న్యూఇయర్ వేడుకలపై పోలీసులు దృష్టి సారించారు. ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. నగరంలోని ఫాంహౌజ్‌లు, రిసార్ట్స్‌లకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. పోలీసులు, ట్రాఫిక్ పోలీసులతోపాటు అదనపు బలగాలు షిఫ్టుల వారీగా సోమవారం ఉదయం వరకు తనిఖీలు చేపడుతున్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని వాహనదారులకు హెచ్చరించారు. దీంతో పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తూ డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు. వాహన ధ్రువపత్రాలు లేని వారికి, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి జరిమానాలు విధించారు. నూతన సంవత్సరం సందర్భంగా డీజే సౌండ్‌లకు పోలీస్ శాఖ అనుమతి ఇవ్వలేదు. ఎవరైనా ప్రజలకు ఇబ్బంది కలిగేలా చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వాహనాల తనిఖీ

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలో పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహన ధ్రువపత్రాలు లేని వారికి, హెల్మెట్ లేని వాహనదారులకు జరిమానా విధించారు. నూతన సంవత్సరం సందర్భంగా వాహనదారులు మద్యం సేవించి నడుపరాదని సూచించారు.

పెండింగ్ చలాన్ల వసూళ్లకు స్పెషల్‌డ్రైవ్

రెంజల్: పెండింగ్ చలాన్ల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ప్రభుత్వం ఇటీవల వాహనాలకు గతంలో ఉన్న పెండింగ్ చలాన్లపై రాయితీని ప్రకటించడంతో సిబ్బందితో కలిసి తనిఖీ చేపట్టినట్లు పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల ప్రధాన కూడళ్ల వద్ద తనిఖీలు చేపడుతూ పెండింగ్ చలాన్లను యాప్ ద్వారా వసూలు చేస్తున్నట్లు చెప్పారు. వాహనదారులు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్ణిత గడువులోగా చలాన్లను చెల్లించాలని ఎస్సై కోరారు.

జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌కు క్రీడాకారుల ఎంపిక



కామారెడ్డి అర్బన్: హైదరాబాద్ జీఎంసీ బాలయోగి స్టేడియంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ స్టేట్ మీట్‌లో కామారెడ్డి జిల్లా క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించడంతో పాటు జాతీయస్థాయికి ఎంపికైనట్టు మాస్టర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.నరేశ్ తెలిపారు. జిల్లా నుంచి పాల్గొన్న వారిలో చంద్రశేఖర్‌గౌడ్, దినేశ్, సతీశ్‌రెడ్డి, నరేశ్, ప్రవీణ్‌గౌడ్ జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. అనంతరం విజేతలకు రంజిత్‌మోహన్, పలువురు అభినందనలు తెలిపారు.

క్రైం కార్నర్

విద్యుత్ వైర్లు తగిలి బాలుడికి గాయాలు

ఖలీల్‌వాడి: నగరంలోని బోర్గాం ప్రాంతానికి చెందిన వెంకట్ శ్రీరాం(9) విద్యుత్ వైర్లకు తగలడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం .. ఆర్యనగర్‌లోని సంజీవ్‌నగర్ కాలనీలో హైటేషన్ వైర్లకు గాలిపటం చిక్కడంతో తీయడానికి ఇనుపరాడ్‌తో తీస్తుండగా కరెంట్‌షాక్‌కు గురయ్యాడు. దీంతో స్థానికులు జీజీహెచ్‌కు తరలించగా స్థానిక వైద్యుల సూచన మేరకు కుటుంబీకులు హైదరాబాద్‌కు తరలించారు.

యువతి అదృశ్యం

బోధన్‌రూరల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు రూరల్ ఎస్సై నాగనాథ్ ఆదివారం తెలిపారు. శనివారం ఉదయం కళాశాలకు వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లిన యువతి తిరిగి సాయంత్రం ఇంటికి చేరుకోలేదు. కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఖతర్‌లో సిర్‌పూర్ వాసి మృతి



మోపాల్: మండలంలోని సిర్‌పూర్ గ్రామానికి చెందిన వేముల వెంకటి (48) ఖతర్ దేశంలో శనివారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. వెంకటి ఉపాధి నిమిత్తం 18 ఏళ్లుగా ఖతార్ దేశానికి వెళ్లి వస్తున్నాడు. శనివారం పని చేస్తుండగా ఛాతిలో నొప్పి వచ్చి కుప్పకూలిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. వెంకటి మృతి విషయాన్ని భార్య స్వరూపకు కంపెనీ ప్రతినిధులు ఫోన్‌లో సమాచారం అందించారు. మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేలా చూడాలని భార్య స్వరూప ఎమ్మెల్యే భూపతిరెడ్డిని, ప్రభుత్వాన్ని కోరారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



మోపాల్: కుమార్తె పెళ్లి తనకు చెప్పకుండా చేస్తున్నారని ఇటీవల మోపాల్ పీఎస్ ఎదుట నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సింగంపల్లికి చెందిన కోహిల్కర్ రాజు (40) ఆదివారం మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌ఓ గంగాధర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రాజు 15 ఏళ్ల క్రితం ఇద్దరు పిల్లలు, భార్యతో కలిసి సింగంపల్లికి ఉపాధి నిమిత్తం వచ్చాడు. ట్రావెల్స్ వాహనం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. దంపతులిద్దరు గొడవ పడటంతో రెండేళ్ల క్రితం భార్య సవిత బీబీపేట్‌కు వెళ్లిపోయింది. గురువారం కుమార్తె గంగకు వివాహం చేస్తుండగా, ఆ వివాహం నిలిపేయాలని పోలీసులపై ఒత్తిడి తెస్తూ రాజు డీజిల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. వెంటనే చికిత్స నిమిత్తం పోలీస్‌వాహనంలో క్షతగాత్రుడిని తరలించి చికిత్స అందించారు. ఆదివారం ఉదయం చికిత్స పొందుతూ రాజు మృతిచెందాడు. గ్రామస్తుల సహకారంతో సింగంపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు.

రెచ్చిపోతున్న పెట్రోల్ దొంగలు

నిజాంసాగర్: ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాల నుంచి పెట్రోల్ చోరీ గురవుతోంది. మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో పలు ద్విచక్రవాహనాల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి పెట్రోల్ చోరీకి పాల్పడ్డారు. పెట్రోల్‌తో నిండుగా ఉండే ట్యాంకులు ఖాళీ కావడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రాత్రివేళ పోలీసలు పెట్రోలింగ్ చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.